# సాక్షి తిరుపతి

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025






## చౌకదగా!

జిల్లాలో చౌకదుకాణాల పరిస్థితి దయనీయంగా మారింది. అరకొర నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. - 8లో



## వైభవంగా గోవిందుని తెప్పోత్సవాలు

తిరుపతిలో ఏడు రోజుల పాటు జరగనున్న గోవిందరాజ స్వామి తెప్పోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో




## మా ఇళ్లు వదులుకోం

ప్రాణాలైనా తీసుకుంటాం.. మా ఇళ్లు వదులుకోమని రేణిగుంటలోని గువ్వల కాలనీ వాసులు తేల్చి చెప్పారు. - 8లో

## న్యూస్‌రీల్

### అండర్‌పాస్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



పార్లమెంట్‌లో చిల్లకూరు అండర్ పాస్ నిర్మాణంపై మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

**తిరుపతి మంగళం:** తిరుపతి పార్లమెంట్ పరిధిలోని గూడూరు పట్టణానికి ప్రధాన మార్గమైన చిల్లకూరు కూడలి వద్ద చెన్నై–కోల్‌కత ప్రధాన రహదారిపై అండర్ పాస్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని, ప్రమాదాల నివారణ కోసం అక్కడ వాహన చోదకులు, పాదచారులకు అనుకూలంగా ఉండే విధంగా వెహికల్ అండర్ పాస్ నిర్మాణం చేయాలని గతంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర మంత్రికి విన్నవించారు. ఆ సమయంలో చిల్లకూరు కూడలిలో ట్రాఫిక్‌కి సంబంధించిన వీడియోలు, ఫొటోలను చూపించి సమస్య తీవ్రతను ఆయనకు వివరించినట్లు ఎంపీ తెలిపారు. ఢిల్లీ పార్లమెంట్‌లో గురువారం ఈ విషయాన్ని మరోసారి అయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.45.82 కోట్లతో వెహికల్ అండర్ పాస్ నిర్మాణం మంజూరైందని, ఇది ప్రస్తుతం టెండర్ దశలో ఉందని కేంద్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి గడ్కరీ సమాధానం ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి సహకరించిన కేంద్ర మంత్రి గడ్కరీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,600 మంది స్వామివారిని దర్శించుకోగా 19,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 210 గంటల కాలవ్యవధి ఉన్న అసిస్టెంట్ టెక్నీషియన్–కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుకు 10వ తరగతి, ఆపై విద్యార్హత ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరదలచిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 81435 76866, 99851 29995నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

# నత్తే నాకు పోటీ!

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో సిటీ ఆపరేషన్ బిల్డింగ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే కాంట్రాక్టర్ నెట్టుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పైసా విదల్చకపోవడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఎవరు పట్టించుకుంటారో.. ఎప్పటికి పూర్తవుతుందోనని .. స్థానికులు చర్చించుకుంటున్నారు.





కొనసా....గుతున్న సిటీ ఆపరేషన్ బిల్డింగ్ నిర్మాణం

- సా..గుతున్న తిరుపతి స్మార్ట్ భవన నిర్మాణ పనులు
- రూపాయి విదల్చని కూటమి ప్రభుత్వం
- గత చెలింపులతోనే నెట్టుకొస్తున్న బిల్డర్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా విడుదల కోసం ఎదురుచూపు

**కన్నెత్తి చూడని కూటమి**



కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి ఏడు నెలలు పూర్తయింది. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయీ విదిల్చలేదు. నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టు సంస్థకు ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. దీంతో సిటీ ఆపరేషన్ మిషన్ సెంటర్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పెండింగ్ నిధులను సకాలంలో చెల్లిస్తే మరో ఆరు నెలల్లో ఈ భవనం పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను జమ చేస్తే ఆ రికార్డులను స్మార్ట్ సిటీ మిషన్‌కు మెయిల్ చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని విడుదల చేస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.

**తిరుపతి తుడా:** తిరుపతి సిటీ ఆపరేషన్ బిల్డింగ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో ఆత్యాధునిక భవన నిర్మాణానికి గత ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రస్తుతం 40 శాతానికి పైగా పనులు పూర్తి చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి విదల్చకపోవడంతో భవన నిర్మాణ పనులపై నీలి నీడలు అలుముకున్నాయి. కాంట్రాక్ట్ సంస్థ తన శక్తి మేరకు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది.

**గత ప్రభుత్వ నిధులతోనే..!**

మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనానికి 2019 డిసెంబర్ 11న స్మార్ట్ సిటీ బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేశారు. కోవిడ్ కారణంగా రెండేళ్లపాటు బ్రేక్ పడడంతో తిరిగి ఈ ప్రాజెక్టును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో పట్టాలెక్కించింది. 2022 జూలై 23న టెండర్‌ను దక్కించుకున్న ఆర్‌ఆర్ తులసి బిల్డర్స్ సంస్థ వర్క్ ఆర్డర్‌ను అందుకుంది. అన్ని అడ్డంకులు తొలగి అదే ఏడాది డిసెంబర్‌లో నిర్మాణ పనులను ప్రారంభించింది. రెండేళ్ల కాల వ్యవధితో ప్రారంభమైన ఈ ప్రాజెక్టుకు 2023లో నాలుగు దఫాల్లో మొత్తం రూ.18 కోట్ల వరకు నాటి ప్రభుత్వం చెల్లించింది. ఆ నిధులతో పాటు కాంట్రాక్టు సంస్థ తన సామర్థ్యం మేరకు వెచ్చించి 40 శాతం పనులను పూర్తిచేసింది. ప్రస్తుతం ఐదో అంతస్తుకు స్లాబ్ పనులు జరుగుతున్నాయి.

### ఐకానిక్‌గా భవనం

తిరుపతి నగరానికి తలమానికంగా ఉండేలా సిటీ ఆపరేషన్ బిల్డింగ్ సెంటర్‌ను నిర్మించాలని నాటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన తనయుడు భూమన అభినయ్‌రెడ్డి రూపకల్పన చేశారు. నాటి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అధికారులతో చర్చించి భవన నిర్మాణ అవశ్యకతను వివరించారు. ఈ క్రమంలోనే 2022లో సిటీ ఆపరేషన్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణ పనులను పట్టాలెక్కించారు. అలా పట్టాలెక్కిన ఈ భవనం 2024లో పూర్తికావాల్సి ఉంది.

### వేగంగా పూర్తి చేస్తాం



"సిటీ ఆపరేషన్ బిల్డింగ్ సెంటర్ పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. తొలి ప్రాధాన్యతగా ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. నిధులు వచ్చిన వెంటనే సీఓసీ బిల్డింగ్‌కు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు చేపడతాం. ప్రస్తుతం ఐదో అంతస్తుకు సంబంధించి స్లాబ్ పనులు జరుగుతున్నాయి. – ఎస్.మౌర్య, మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ

### తిరుపతి స్మార్ట్ బిల్డింగ్ వివరాలు

| | |
|---|---|
| ప్రాజెక్టు: | తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ |
| భవన నిర్మాణం పేరు : | సిటీ ఆపరేషన్ బిల్డింగ్ సెంటర్ |
| నిర్మాణానికి తీర్మానం : | 2019 డిసెంబర్ 11న |
| టెండర్ : | 9- 3 -2022 |
| టెండర్ ఖరారు, వర్కర్ ఆర్డర్: | 23- 7- 2022 |
| టెండర్ దక్కించుకున్న సంస్థ: | ఆర్‌ఆర్ తులసి బిల్డర్స్ తమిళనాడు |
| ప్రాజెక్టు వ్యయం : | రూ.90 కోట్లు |
| నిర్మాణ కాలపరిమితి : | 24 నెలలు |
| పూర్తి చేయాల్సిన తేదీ: | 22- 7- 24 |
| భవన నిర్మాణ విస్తీర్ణం: | 1,57,171 చ.అ |
| అంతస్తులు: | జి ప్లస్ ఫైవ్ |
| ఇప్పటి వరకు చెల్లించిన మొత్తం: | రూ.18 కోట్లు |
| కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించిన మొత్తం | ఏమీ లేదు |

## 'పేట'లో రామనాథపురం ఎక్స్ ప్రెస్



లోకో పైలెట్లను సత్కరిస్తున్న దృశ్యం

**నాయుడుపేటటౌన్:** రామేశ్వరానికి వెళ్లే ప్రయాణికులకు అనువుగా నాయుడుపేటలో రామనాథపురం ఎక్స్ ప్రెస్ రైలును నిలుపుదల చేస్తున్నట్టు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీజూరు మస్తానయ్య, డీఆర్‌యూసీసీ సభ్యులు పేర్నాటి జోసఫ్ తెలిపారు. గురువారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో మొదటి సారిగా నిలుపుదల చేసిన రామనాథపురం ఎక్స్ ప్రెస్ రైలును పూలతో అలంకరించి లోకో పైలెట్‌లకు పూల మాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గురువారం ఉదయం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 8.15 గంటలకు నాయుడుపేటకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కన్నీటి నివాళి



అధికార లాంఛనాలతో నరసయ్య అంత్యక్రియలు

**పెళ్లకూరు:** మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన 9వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ మగ్గం నరసయ్య(35) అంత్యక్రియలను గురువారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. 40 రోజుల కిందట నాయుడుపేటకు చెందిన పార్వతిని వివాహం చేసుకున్న ఆయన బుధవారం గ్రామంలో జరిగిన పోలేరమ్మ జాతరలో పాల్గొన్నాడు. అదే సమయంలో ఇంటి వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయి హఠన్మరణం చెందిన విషయం తెలిసిందే. 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో అధికార లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు. నరసయ్య మృతి విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొని రోదించారు. ఇక నాకు దిక్కెవరంటూ భార్య పార్వతి గుండెలు బాదుకుంటూ కన్నీళ్లు పెట్టడం అక్కడివారిని కలచివేసింది.

## ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి తుడా:** తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, శ్రీపద్మావతి నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, విజయవాడవారి ఆదేశాల మేరకు గురువారం పలు ఉద్యోగాలకు నూతన నోటిఫికేషన్‌ను విడుదల చేశామని తెలియజేశారు. ఉద్యోగాల వివరాలు, అర్హతల కోసం https://tirupati.ap.gov.in, https://chittoor.ap.gov.in, www.svmctpt.edu.in వెబ్‌సైట్లను సంప్రదించాలని కోరారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఎస్వీ వైద్య కళాశాలలో అందజేయాలని సూచించారు.

# తగ్గేదేలే!

- అధికారుల బెదిరింపులకు వెనక్కి తగ్గని జూడాలు
- జూడాల సమ్మెతో బోసిపోయిన వెటర్నరీ వైద్యశాల
- సమ్మెతో ఆస్పత్రి వైపు చూడని రైతులు, పెట్ యజమానులు
- విద్యార్థులను అదుపులో పెట్టండంటూ తల్లిదండ్రులకు ఫోన్‌కాల్స్



తిరుపతిలో వెటర్నరీ జూడాల భారీ ర్యాలీ



బోసిపోయిన వర్సిటీ పశువైద్యశాల

**తిరుపతి సిటీ:** ఎస్వీ వెటర్నరీ విద్యార్థులు తమ న్యాయపరమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కారు. గత నాలుగు రోజులుగా గౌరవ వేతనాన్ని పెంచాలంటూ కదం తొక్కుతున్నారు. సమ్మె చేస్తున్న విద్యార్థులపై అధికారులు బెదిరింపులకు పాల్పొడుతున్నా లెక్క చేయకుండా తగ్గేదేలే అంటూ ఎదురొడ్డి పోరాడుతున్నారు. సమస్య పరిష్కరమయ్యేవరకు సమ్మె విరమించేది లేదని భీష్మించుకుంటున్నారు. ఇందులో భాగంగా రోజుకొక రీతిలో సమ్మెను నిర్వహిస్తూ తమ నిరసన తెలియజేస్తున్నారు. గురువారం వర్సిటీ నుంచి స్థానిక బాలాజీ కాలనీ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

**బెదిరిపుల పర్వం ప్రారంభం**

విద్యార్థుల చేత సమ్మె విరమింపజేసేందుకు వర్సిటీ అధికారులు సరికొత్త బెదిరింపుల పర్వానికి తెరదీశారు. మహిళా విద్యార్థులకు బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వర్సిటీ అధికారులు ఫోన్లు చేసి మీ అబ్బాయిని అదుపులో పెట్టండి సమ్మెలో పాల్గొంటున్నారు.. భవిష్యత్తు ఏమవుతుంది... అంటూ బుధవారం నుంచి బెదిరింపులకు దిగుతున్నారు. విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కార మార్గాల కోసం ప్రయత్నించకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బెదిరించడం ఏంటని జూడాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### గౌరవ వేతనం పెంచాల్సిందే

తాము గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదని ఎన్నో ఏళ్లుగా తమకు అందిస్తున్న రూ.7వేల గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేస్తున్నామ చెబుతున్నారు. సమ్మెకు గల కారణాలు తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉందని తమకు ప్యారెంట్స్ నుంచి మద్దతు ఉందని అంటున్నారు. ఇంటర్నర్ షిప్ చేస్తూ రోజువారి ఖర్చులకు తల్లిదండ్రులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మూగవేదన!

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశువైద్యశాల తిరుపతి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి పశువుల వైద్య కోసం వచ్చే రైతులతో నిత్యం రద్దీగా కనిపించేంది. అలాంటిది వెటర్నరీ జూడాలు సమ్మెకు పిలుపు నివ్వడంతో పశువైద్యశాల బోసిపోతోంది. సమ్మె విషయం రైతులు, పెట్ యజమానులు తెలుసుకుని వైద్యం కోసం వర్సిటీ ఆస్పత్రికి రాకుండా ప్రత్యామ్నాయాన్ని వెతుకుంటున్నారు. దీంతో గత మూడు రోజులుగా వైద్యశాల కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.

# అమ్మో..బంగారం!

### భగ్గుమంటున్న బంగారం

- రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర
- వివాహ శుభగడియలు ప్రారంభం
- బోసిపోతున్న బంగారు షాపులు
- పసిడి ఆభరణాలంటేనే భయపడుతున్న ప్రజలు
- వివాహాల కోసం తప్పని తిప్పలు



**పసిడి పరుగులు ఇలా..**

| సంవత్సరం | పది గ్రాములు ధర (రూ.) |
|---|---|
| 2005 | 7,000 |
| 2010 | 18,500 |
| 2015 | 26,343 |
| 2019 | 39,500 |
| 2025 | 83,000 |

**తిరుపతి సిటీ:** మూఢ నెలగా భావించే పుష్య మాసం పూర్తైంది. గత నెల 30వ తేదీ నుంచి మాఘమాసం ప్రారంభమైంది. వివాహాలు, గృహ ప్రవేశాలు, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారం, వాహనాల కొనుగోలు, భూమిపూజ వంటి శుభకార్యాలకు నాలుగు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి 2 నుంచి జూన్ 7వ తేదీవరకు సుమారు 23 రోజులకు పైగా వివాహాలకు అనువైన శుభగడియలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ సమయంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల వరకు వివాహాలు జరిగే అవకాశం ఉంది. వివాహాలకు బంగారు, వెండి ఆభరణాలు అవసరం. ప్రస్తుతం మార్కెట్లో తులం బంగారం రూ. 83వేలకు పైగా పలుకుతుండడంతో వివాహాలు నిర్వహించే కుటుంబాలకు తిప్పలు తప్పడం లేదు. అప్పు చేసైనా బంగార ఆభరణాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

**మిడిసిపడుతున్న పసిడి!**

ఎంతటి పేదలైనా వివాహ శుభకార్యానికి కనీసం రెండు తులాల నుంచి 10 తులాల వరకు బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తుంటారు. ధరలు ఆకాశాన్నంటడంతో పెళ్లిళ్లు జరిగే కటుంబాలలో కలవరం మొదలైంది. ప్రస్తుతం మార్కెట్‌లో 22 క్యారెట్లకు చెందిన ఒక గ్రామ్ బంగారం ధర రూ.7,906 ఉండగా, 24 క్యారెట్ల బంగారం రూ.8,625 పలుకుతోంది. వెండి కిలో రూ.94,578 ఉంది. దీంతో సాధారణ, పేద, మధ్యతరగతి ప్రజలు వివాహాలకు తాము అనుకున్న పరిణామం కంటే తగ్గించి కొనుగోలు చేసేందుకు మొగ్గ చూపుతున్నారు.

### వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు



ధరల పెరుగుదలతో సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గింది. దీంతో పాటు ప్రజల వద్ద నగదు రొటేషన్ తగ్గింది. వివాహ శుభముహూర్తాల సమయంలో తిరుపతి నగరంలో ప్రతి బంగారు దుకాణం కిటకిటలాడేది. చిన్నబజారు వీధి రాత్రి 11గంటల వరకు తిరునాళ్లను తలపించేది. మాఘమాసం ప్రారంభమై హారు రోజులు కావస్తోంది. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. కానీ ఇంత వరకు వ్యాపారం పుంజుకోలేదు. వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంది.
–హేమభూషణ్‌రెడ్డి, జ్యువెలరీ షాపు అధినేత, తిరుపతి

### భయమేస్తోంది



శుభ ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్నాం. మా అబ్బాయికి డిసెంబర్ మొదటి వారంలో నిశ్చితార్థం చేసుకున్నాం. మంచి రోజులు లేకపోవడంతో మార్చి 6వ తేదీ వివాహం జరిగేలా పెద్దలు నిశ్చయించారు. బంగారం కనీసం 10 తులాలు కొనాలని అనుకున్నాం. కానీ ధరలు ఆకాశానంటుతున్నాయి. అప్పు చేస్తే తీర్చడం కష్టం. అందుకోసం 7తులాలు మాత్రమే కొనుగోలు చేయాలని అనుకుంటున్నాం. – శ్రీవైష్ణవి, పెళ్లికుమారుని తల్లి, తిరుపతి

### సామాన్యుడు కొనే పరిస్థితి లేదు



మా అమ్మాయికి ఈనెల 21వ తేదీ పెళ్లి పెట్టుకున్నాం. మాది సాధారణ కుటుంబం. ప్రధానంగా బంగారు ఆభరణాల విషయంలో ప్రస్తుత ధరలను చూస్తే ఎలా కొనుగోలు చేయాలో అర్థం కావడం లేదు. పెళ్లి కుమారునికి, మా పాపకు కలిపి తక్కువలో తక్కువగా కనీసం 12 తులాలు పెట్టాలి అనుకున్నాం. అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. – కృష్ణమూర్తి పీఆర్, పెళ్లి కుమార్తె తండ్రి, తిరుపతి

### జూన్ 7 వరకు శుభఘడియలు



వివాహదిశుభ కార్యాలయాలకు అమృత ఘడియలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో సుమారు 11రోజుల పాటు ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ 7వ తేదీ వరకు గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు, వివాహాలు, దుకాణల ప్రారంభం, అక్షరాభ్యాసం, వాహనకొనుగోలు వంటి శుభకార్యాలకు అనువైన సమయం. మాఘ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ చతుర్ధి ఫిబ్రవరి 27తో ముగుస్తుంది.
– డాక్టర్ తూమాటి బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, వేదిక్ వర్సిటీ

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న శివనారాయణ

**రేణిగుంట:** రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించేలా ప్రోత్సహించాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ వి.సుమతి అధ్యక్షత వహించారు. శివనారాయణ మాట్లాడుతూ ప్రధాన పంటలలో వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించాలన్నారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసులు 2024–25 సంవత్సరంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ ఏడాది చేపట్టిన కార్యక్రమాలు, 2025–26 సంవత్సరానికి చేపట్టబోయే కార్యక్రమ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా.బి.గోవిందరాజులు, తిరుపతి ఎస్వీ పశుసంవర్ధక విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎస్.శోభామణి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రమాదంలో భర్త మృతి

**బుచ్చినాయుడుకండ్రిగ:** ఆస్పత్రిలో కాన్పు కోసం చేరిన భార్య వద్దకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందిన ఘటన మండలంలోని చల్లమాంబపురం గ్రామం వద్ద కేటీ రోడ్డుపై చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం, బసవయ్యగుంట గిరిజన కాలనీకి చెందిన హరికృష్ణ (24) భార్యకు రెండో కాన్పు కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో హరికృష్ణ గురువారం ద్విచక్ర వాహనంపై ఆస్పత్రిలోని భార్య వద్ద వెళ్తుండగా మార్గ మధ్యంలో చల్లమాంబపురం గ్రామం వద్ద కేటీరోడ్డుపై శ్రీకాళహస్తి నుంచి వస్తున్న మినీలారీ ఢీ కొంది. దీంతో హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందా డు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### రేపు తిరుపతిలో జాబ్‌మేళా

**తిరుపతి అర్బన్:** తిరుపతి నగరం న్యూ బాలాజీ కాలనీలోని ఎమ్‌రాల్డ్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి జై ఇన్ఫోటెక్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జై గణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీతోపాటు బీటెక్, డిప్లొమా, ఐటీఐ చదువుకున్న 18–35 ఏళ్ల వయస్సు కల్గిన వారు అర్హులుగా పేర్కొన్నారు. యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళా కార్యక్రమానికి పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 96763 76855, 90008 58008 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

**తిరుపతి అర్బన్:** జిల్లాలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. ఇందులో తొట్టంబేడు మండలంలోని ఎగువ సాంబయ్యపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు టీకృష్ణయ్య 4, 7 తరగతుల విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు అందిన ఆరోపణల నేపథ్యంలో అతన్ని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. అలాగే నారాయణవనం మండలం, ఎరికంబట్టు ఎస్సీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల సెంకడరీ గ్రేట్ ఉపాధ్యాయుడు టీ.వెంకటరమణ విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణల మేరకు విచారణ అనంతరం అతన్ని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

# చౌకదగా!


తిరుచానూరులో రేషన్ సరుకుల కోసం క్యూకట్టిన కార్డుదారులు

### రేషన్ షాపుల్లో అరకొర సరుకులు

- కందిపప్పు, చిరుధాన్యాల పంపిణీకి మంగళం
- బియ్యం తూకాల్లోనూ మోసం
- లబోదిబోమంటున్న కార్డుదారులు


గతంలో ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ

**తిరుపతి అర్బన్:** రేషన్ షాపుల్లో నిత్యావసరాలు అరకొర పంపిణీ చేస్తున్నారు. దీనిపై కార్డుదారులు మండిపడుతున్నారు. గతంలో ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకు రేషన్ డీలర్ల వద్ద బియ్యంతోపాటు కంది పప్పు, నూనె, గోధుమ పిండి, రాగులు, ఉప్పు తదితర అన్ని రకాల సరుకులను క్రమం తప్పకుండా ఇచ్చేవారు. అంతేకాదు చిరుధాన్యాలు సైతం పంపిణీ చేసేవారు. ఆ తర్వాత రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం రేషన్ షాపులకు అరకొర సరుకులు అందించి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది.

**బియ్యంతోనే సరి**

మొదటి మూడు నెలలు కూటమి ప్రభుత్వం ఒక్క బియ్యంతోనే సరిపెట్టేసింది. ఆ తర్వాత మూడు నెలల నుంచి బియ్యంతోపాటు అరకొర కంది పప్పు, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కంది పప్పు ప్రైవేటు మార్కెట్లో కిలో రూ.130 నుంచి రూ.140 వరకు పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో అయితే కిలో రూ.67కే అందించాల్సి ఉంది.

### నిరీక్షించలేక..క్యూలో నిల్చోలేక..

జిల్లాలో 1,457 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి 300 మంది డీలర్లను తొలగించారు. ఆ స్థానంలో ఇన్‌చార్జులకు అప్పగించారు. మరోవైపు 369 ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం 40 శాతం కూడా ఎండీయూ వాహనాలు పనిచేయడం లేదు. అంతా డీలర్ల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఆలస్యంగా వెళితే సరుకులు ఉండవని ఉద్దేశంతో తొలి రోజు నుంచే కార్డుదారులు డీలర్ల వద్దకు క్యూ కడుతున్నారు. గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు.

**తూకాల్లో మోసాలు**

జిల్లాలోని పలుచోట్ల తూకాల్లో డీలర్లు తక్కువగా ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. డీలర్లను ప్రశ్నిస్తే తమకు గోదాముల నుంచి తూకాలు తక్కువ వస్తున్నాయని సమాధానం ఇస్తున్నారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

### అన్ని సరుకులకు ఒక్కసారే బయోమెట్రిక్

సరుకులు ఇవ్వడానికి డీలర్ ప్రతి నెలా కార్డుదారుల నుంచి ఈపోస్ మిషన్‌లో బయోమెట్రిక్ తీసుకుంటారు. అయితే బియ్యంతోపాటు చక్కెర, కంది పప్పు, ఇతర వస్తువులు అన్నింటికీ ఒక్కసారే బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. కార్డుదారులకు మాత్రం బియ్య ఒక్కటే ఇచ్చి పంపుతున్నారు. దీంతో సివిల్ సప్లయ్ అధికారులు ఎవరికి కందిపప్పు ఇచ్చారు. ఎవరికి బియ్యం ఇచ్చారో తేల్చుకోలేకపోతున్నారు. ఇదే అదునుగా కొందరు డీలర్లు కంది పప్పును అధిక రేట్లకు మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు సమాచారం. డీలర్లను ప్రశ్నిస్తే ఈ నెలలో స్టాక్ చాలాక్కువ వచ్చిందంటూ బుకాయిస్తున్నట్టు తెలుస్తోంది. మరికొందరు కందిపప్పు, చక్కెరకు ఈ నెలలో డీడీలు కట్టలేదంటూ సమాధానం ఇస్తున్నట్టు కార్డుదారులు చెబుతున్నారు.

### జిల్లా సమాచారం

| | |
|---|---|
| రేషన్ దుకాణాలు | 1,457 |
| గతంలో ఎండీయూ వాహనాలు | 369 |
| అందుబాటులో ఉండే వాహనాలు | 190 |
| రేషన్‌కార్డులు | 6,03,000 |
| ప్రతి నెలా బియ్యం | 8,350 మెట్రిక్ టన్నులు |
| చక్కెర | 300 మెట్రిక్ టన్నులు |
| కంది పప్పు | 600 మెట్రిక్ టన్నులు అవసరం |
| ఈ నెల వచ్చింది | 279.75 టన్నులే |

### 17వ తేదీ వరకు సరుకులు ఇవ్వాల్సిందే



ప్రతి రేషన్ డీలర్ 1 నుంచి 17వ తేదీ వరకు రేషన్ సరుకులు ఇవ్వాల్సిందే. బియ్యం ఉచితంగా ఇవ్వాలి. కంది పప్పు కిలో రూ. 67 చొప్పున, చక్కెర అరకిలో రూ.17 చొప్పున అవసరమైన కార్డుదారులకు పంపిణీ చేయాలి. ప్రస్తుతం ఈ మూడు సరుకులు ఇస్తున్నాం. అదనంగా ఏవైనా వస్తువులు వస్తే వాటిని అందిస్తాం. తూకాల్లో మోసాలు చేస్తే చర్యలు తప్పవు.
– శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

### జిల్లాకు 279.75 మెట్రిక్ టన్నుల కందిపప్పు



ఫిబ్రవరికి సంబంధించి జిల్లాకు 279.75 మెట్రిక్ టన్నుల కందిపప్పు వచ్చింది. ఆ మేరకు డీలర్లకు గోదాముల నుంచి తోలాము. మిగిలిన కందిపప్పు వచ్చిన తర్వాత పంపుతాం. బియ్యం విషయంలో తూకాల్లో తేడాలు లేకుండా కచ్చితంగా పంపాలని జిల్లాలోని అన్ని గోదాముల డీటీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. – వై.సుమతి, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్

### గృహ హింస కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

**వడమాలపేట (విజయపురం):** గృహహింస, అదనపు వరకట్నం వేధింపుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు గురువారం వడమాలపేట ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. వడమాలపేట మండలం పత్తిపుత్తూరు పంచాయతీ అమ్మగుంట గ్రామానికి చెందిన శ్రీవాణి తన భర్త మదన్‌మోహన్‌రెడ్డి, అత్త నాగమ్మ, ఆడబిడ్డ రాజ్యలక్ష్మి, మామ సుబ్బారెడ్డి అదనపు వరకట్నం కోసం తనని వేధిస్తున్నారని, గృహ హింసకు పాల్పడుతున్నారని వడమాలపేట పోలీస్ స్టేషన్‌లో 2016లో ఫిర్యాదు చేసింది. దీనిపై పుత్తూరు కోర్టులో కేసు నడిచింది. 2019లో శ్రీవాణి భర్త మదన్‌మోహన్ రెడ్డి మృతి చెందారు. ముద్దాయిలు అయిన బైనగారి నాగమ్మ , రెడ్డెప్పగారి రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ పుత్తూరు జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ గోపాల కృష్ణ తీర్పు చెప్పారని ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే సుబ్బారెడ్డికి రూ.9 వేలు, నాగమ్మ, రాజ్యలక్ష్మిలకు రూ. 8 వేల చొప్పన జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పర్యవేక్షణలో దర్యాప్తు సాగిందన్నారు. కాగా ఏపీపీ నిర్మల, వడమాలపేట ఎస్‌ఐ ధర్మారెడ్డి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణరాజు పర్యవేక్షించారు.

### దరఖాస్తుల గడువు పెంపు

**తిరుపతి అర్బన్ :** బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి తెలిపారు. గతంలో గడువు 7వ తేదీ వరకు విధించినట్లు తెలిపారు. లబ్ధిదారుల వినతి మేరకు ప్రభుత్వం గడువును పొడిగించిందని తెలిపారు.

## ప్రాణాలైనా అర్పిస్తాం... మా ఇళ్లు వదులుకోం


ఆర్డీఓకు తమ బాధను చెప్పుకుంటున్న గువ్వల కాలనీ వాసులు


వ్యాపారం చేసే పూసల దండలను చూపుతున్న మహిళలు

- ఆర్డీఓ జరిపిన చర్చలు విఫలం
- ఆయన ఎదుటే నిరసనకు దిగిన గువ్వల కాలనీ వాసులు

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** 'రైల్వే స్టేషన్‌ని నమ్ముకుని జీవిస్తున్నాం. ఏళ్ల తరబడి ఇక్కడే నివాసాలు ఏర్పరుచుకుని బతుకులీడుస్తున్నాం. ఇప్పుడు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో పంపిస్తామంటే ఊరుకోం. ప్రాణాలైనా అర్పిస్తాం. మా ఇళ్లు వదులుకోం' అని శ్రీకాళహస్తి ఆర్డీఓ ఎదుట గువ్వల కాలనీ వాసులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీ, గువ్వల కాలనీ వాసులతో గురువారం ఆర్డీఓ భాను ప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు చర్చలు జరిపారు. రైల్వే లైన్ విస్తరణలో భాగంగా ఇళ్లు ఖాళీ చేయాలని సూచించారు. ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం కింద 51 మందికి రూ.14 కోట్లు కేటాయిందని తెలిపారు. కాటన్ మిల్లు వద్ద ఐదున్నర కోట్లకు రెండు సెంట్లు చొప్పున బాధితులకు కేటాయిస్తామని చెప్పారు. కానీ గువ్వల కాలనీ వాసులు మాత్రం తమకు నష్టపరిహారం అవసరం లేదని తిరస్కరించారు. రైల్వేస్టేషన్లో తాము పూసలమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, తమకు ఆ ప్రాంతం కాకుండా రైల్వే స్టేషన్‌కు దగ్గరగా ఉన్న మరొక ప్రాంతంలో స్థలాలు కేటాయిస్తే వెళ్లేందుకు సిద్ధమని బాధితులు ఆర్డీకో దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రాత్రి వేళ ఇండ్లకు వచ్చి ఎస్టీలైన తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఒక్కో ఇంట్లో ఐదుగురు చొప్పున ఉంటున్నామన్నారు. విలువైన ప్రాంతాన్ని వదిలి వెళ్లమని ఆర్డీఓ ఎదుటే నిరసన తెలిపారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని..

– ఐస్ క్రీమ్ విక్రయించే వ్యక్తి మృతి


క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన హైవే మొబైల్ సిబ్బంది

**సూళ్లూరుపేట రూరల్/ సైదాపురం:** గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఐస్ క్రీమ్ విక్రయించే వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. బాలయ్యపల్లి మండలం, గోల్లగుంట గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య ఆటోలో ఐస్‌క్రీమ్ విక్రయించేవాడు. పని నిమిత్తం ఆయన ఐక్రీం ఆటోలో సూళ్లూరుపేటకు వస్తుండగా ఆర్టీసీ డిపో సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ సిబ్బంది క్షతగాత్రుడ్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటకృష్ణయ్య మృతిచెందాడు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

### కొండని ఢీకొన్న కారు


దెబ్బతిన్న కారు

**తిరుమల:** తిరుమల రెండో ఘాట్ రోడ్లో ఒక కారు అదుపు తప్పి కొండను ఢీకొట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కర్ణాటకకు చెందిన భక్తులు ఇన్నోవా కార్లో తిరుమలకు బయలుదే వినాయకుడి గుడి సమీపంలో వాహనం అదుపు తప్పింది. ఇదే క్రమంలో కొండను ఢీకొనడంతో ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జయింది. ఇందులో ఆరుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరికి చిన్నపాటి గాయాలయ్యాయి.

### నేటి నుంచి గ్రామ సభలు

**తిరుపతి అర్బన్:** పబ్లిక్, పీపుల్, ప్రైవేట్, పార్టనర్‌షిష్ పేరుతో జీరో పావర్టీ లెక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్రస్థాయి అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో తిరుపతి కమిషనర్ మౌర్యతో కలసి జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ఆర్థికంగా టాప్‌లో ఉన్న 10 శాతం కుటుంబాలను, అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఈ నెల 22 వరకు గ్రామసభలు, పంచాయతీ సమావేశాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. డీపీఓ సుశీలాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయకుమార్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

### ఆకస్మిక తనిఖీలు


తనిఖీలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

**తిరుపతి క్రైం:** విసిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ వీ.హర్షవర్ధన్ రాజు, తిరుపతి రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, జయశ్యాం థియేటర్ రోడ్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండులోని సీసీ కెమెరాలు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కే.రవిమనోహరచారి, డీఎస్పీ శ్రీలత, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి, సీఐ తమీమ్ అహ్మద్ పాల్గొన్నారు.

### ● వైభవంగా గోవిందుని తెప్పోత్సవాలు



శ్రీగోవిందరాజస్వామి తెప్పోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏడు రోజుల పాటు ఈ తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా సాయంత్రం శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు తెప్పపై కొలువై పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. డెప్యూటీ ఈఓ శాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

## ఆహార పంపిణీలో లోటుపాట్లుంటే చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి


జెడ్పీ హైస్కూల్లో వంట గదిని పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్

**నాయుడుపేట టౌన్:** విద్యార్థులకు ఇచ్చే ఆహార పంపిణీలో లోటుపాట్లు జరిగే చర్యలు తప్పవని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం నాయుడుపేట పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు వంట గదులు, బియ్యం, కూరగాయాల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో లోపాలు జరిగేతే చర్యలు తప్పవన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగ విద్యార్థులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని జనరల్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని విద్యార్థుల హాజరు శాతంతో పాటు గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### డ్వాక్రా మహిళలతో ముఖాముఖి


సమావేశంలో పాల్గొన్న సీఈఓ వాకాటి కరుణ

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న స్టేట్ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ ప్రాపర్టీ సీఈఓ వాకాటి కరుణకు అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం రేణిగుంట మండలం, ఎల్లమండ్యంలోని మహిళా భవనంలో స్థానిక డ్వాక్రా సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధికి కావాల్సిన వనరులపై చర్చించారు. అనంతరం గ్రామంలోని భాగ్యలక్ష్మి గ్రూప్ సభ్యులు నిర్వహిస్తున్న సమావేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, డీపీఎం వెంకటేష్, ఏసీ వనజాక్షి, ఏపీఎంలు నాగేశ్వర్‌రావు, దుర్వాసులునాయుడు, పళనికుమార్, సీసీలు శివ, కుళ్లాయప్ప, దుర్గా, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### దోపిడీ దొంగల ముఠా అరెస్ట్


పట్టుబడిన నగలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**తిరుపతి క్రైం :** మున్సిపల్ అధికారులమంటూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ఏడాది డిసెంబర్ 25న కేశవాయనగుంట నాలుగో వీధిలో చోరీ జరిగినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను తాము మున్సిపల్ ఆఫీస్ నుంచి వచ్చామని నమ్మించి చోరీకి పాల్పడినట్టు తెలిపారు. దీంతో బాధితురాలు పోలిన ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. అందులో భాగంగానే నిందితులను గురువారం గుర్తించి చెర్లోపల్లె బైపాస్ రోడ్‌లో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. విచారణలో దొంగతనానికి పాల్పడింది తామేనని వారు ఒప్పుకొని రూ.22 లక్షల విలువ గల 250 గ్రాముల బంగారు, 8 లక్షల విలువ గల కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరంతా కర్ణాటక రాష్ట్రం షిమోగా జిల్లాకు చెందిన కృష్ణ(34), శరత్(24), వేణుగోపాల్‌గా తేలిందన్నారు. ప్రస్తుతం వీరు ముగ్గుర్నీ అరెస్ట్ చేశామన్నారు. కృష్ణ అతని తమ్ముడు శరత్, వేణుగోపాల్ ఒక ముఠాగా ఉండి వారి సహచరులు రవి, గణేష్, ప్రశాంత్‌తో కలిసి చెడు అలవాట్లకు బానిసలై దొంగనాలు చేస్తున్నట్టు తెలిపారు. వీరిపై కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పలు కేసులు ఉన్నాయన్నారు. దొంగతనాలు చేయడానికి ఉదయం, మధ్యాహ్నం సమయంలో ఎంచుకునేవారన్నారు. వీరిపై తిరుపతి సీసీఎస్ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు, అలిపిరి పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదైనట్టు తెలిపారు. అంతేకాకుండా ఒంగోలు, కొండాపూర్, హిందూపూర్, ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో కూడా కేసులు నమోదయ్యాయన్నారు. కేసును ఛేదించడంలో క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం, డీఎస్పీ శ్యామసుందర్ కృషి చేశారని కొనాయాడారు.

### రాష్ట్రానికి నయవంచన


మాట్లాడుతున్న ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రధాన కార్యదర్శి జేడీ లక్ష్మీనారాయణ

**తిరుపతి కల్చరల్:** ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసి నయవంచనకు పాల్పడిందని, రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక విభజన హామీలతో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులు రాబట్టేందుకు రాష్ట్ర ఎంపీలందరూ పార్లమెంట్‌లో ప్రశ్నించి సాధించాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, జేడీ.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలను దగా చేస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.మురళి, సీపీఎం నేత టీ.సుబ్రమణ్యం, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుధాకర్ (ఇన్‌సెట్) టీచర్ కరీమున్నిసా బేగం (ఫైల్)

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయురాలు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం.. రేణిగుంటలో నివాసముంటున్న కరీమున్నిసా బేగం ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మల్రిగుంట కూడలిలో తిరుపతి నుంచి మడిబాకకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రైవేట్ వాహనంలో ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఉపాధ్యాయురాలు మృతి చెందారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.